

సోమశిలలో 52.924 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 52.924 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 780 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.92,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,400
3 శాతం జీఎస్టీతో	రూ.8,652
నవర (8 గ్రా)	రూ.69,216

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /27.0

శనివారం జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

582 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 582 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 682 బేళ్లు రాగా వాటిలో 582 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 76,911 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,06,92,754 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.280 కాగా కనిష్ట ధర రూ.235 లభించింది.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం



ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

ఆత్మకూరు రూరల్: మండలంలోని ఆరవేడులో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి ఆరబెట్టుకొని ఉన్న వరి ధాన్యం తడిచిపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. స్థానిక సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డికి చెందిన 35 పుట్ల ధాన్యం తడిచిపోగా, మరికొందరు రైతులకు చెందిన మరో పది పుట్లకుపైగా ధాన్యం తడిచి పోయింది. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయిద్దామని అధికారుల చుట్టూ తిరుగుతున్నా రోజుల తరబడి పట్టించుకోకపోవడం వల్లే తాము నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కందుకూరు రూరల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. కందుకూరు పట్టణంలోని అమలనాధునివారిపాలెం ప్రాథమిక పాఠశాలను సబ్ కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు చదువు ఎలా సాగుతుందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. పాఠశాలలోని 20 మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దానికి సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ అనూషకు సూచించారు. ఆమె వెంట కందుకూరు ఎంఈఓ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కారుణ్య నియామకాలు



నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కారుణ్య నియామకాల కింద ఇద్దరిని ఆఫీసు సబార్డినేటర్లుగా శుక్రవారం నియమించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, ఉద్యోగ సంఘ నాయకులు పెంచలయ్య, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండుగడ్డి భగ్గుమంటోంది

- ట్రాక్టర్ గడ్డి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు
- ఒక గేదెకు ఏడాదికి రెండు ఎకరాల గ్రాసం అవసరం
- రెండెకరాల ఎండుగడ్డి ఖరీదు రూ.30 వేలు
- ఆందోళన చెందుతున్న పాడి రైతులు

జిల్లాలో పశుసంపద వివరాలు:

గేదెలు 6,46,106

ఆవులు 57,774



పొరుగు జిల్లాల నుంచి ట్రాక్టర్‌లో అమ్మకానికి తెస్తున్న ఎండుగడ్డి మోపులు



ఈ ఫొటోలో ఉన్న పాడి రైతు పేరు బత్తుల సుశీలమ్మ. కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామం. ఈమెకు 3 పాడిగేదెలు ఉన్నాయి. రోజుకు ఒక గేదెకు ఒక మోపు (యంత్రంతో చుట్టినది) ఎండిగడ్డి మేతగా పెట్టాలి. ఒక్కో చుట్టు ధర రూ.120 ఉంది. మూడు గేదెలకు రూ.360 ఖర్చవుతోంది. దాణా, తవుడు ఇతర ఖర్చులు మరో రూ.200 అదనం. మొత్తంగా రూ.560 ఖర్చు చేయాల్సి వస్తోంది. మూడు పాడిగేదెలు ఇచ్చే పాలు 10 నుంచి 12 లీటర్లు. వాటిపై ఆదాయం రూ.700 వస్తోంది. అంటే ఆమె రోజంతా శ్రమపడితే మిగులుతోంది రూ.140. కనీసం రోజు కూలి కూడా దక్కని పరిస్థితి.



ఈ ఫొటోలో ఉన్న పాడి రైతు పేరు ఓరుగంటి మాలకొండయ్య. కావలి రూరల్ మండలం కొత్తపల్లికి చెందిన ఈయనకు ఐదు గేదెలు ఉన్నాయి. ప్రతి రోజూ కావలి పట్టణానికి పాలను తీసుకొచ్చి అమ్మకాలు చేస్తుంటాడు. ఐదు గేదెలు రోజూ 20 లీటర్ల పాలు ఇస్తాయి. ఇలా ఆరు నెలలు మాత్రమే ఇస్తాయి. మిగతా ఆరు నెలలపాటు ఆదాయం లేకపోయినా గేదెలను మేపడం తప్పనిసరి ఆర్థిక భారంగా ఉంది. ఎండుగడ్డి ధరలు పెరిగినా గేదెలకు మేత కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. పాడి రైతుగా మూగజీవాలతో ఉన్న అనుబంధం తుంచుకోలేక, ఖాళీగా ఇంటి పట్టున ఉండలేక పాడి రైతుగా చాకిరీ చేస్తున్నానని ఈ రైతు వాపోయాడు.

కావలి: వేసవిలో పశువులకు ఎండుగడ్డే ప్రధాన ఆహారం. వేసవి రాకముందే పాడి రైతులు వరిగడ్డిని సేకరించి వాములను ఏర్పాటు చేసుకోవడం సహజమే. అయితే ఈ ఏడాది ఎండుగడ్డి కొరత రైతులను వేధిస్తోంది. గతంలో ఒక ట్రాక్టర్ లోడు ధర రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. పాడిపైనే ఆధారపడి బతికే రైతులు అప్పులు చేసి మరీ వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. పచ్చిగడ్డి అందుబాటులో లేని ఎండాకాలంలో ఎండుగడ్డి రైతులకు పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. వరి కోతలు ముగిసిన తర్వాత అందుబాటులోకి వచ్చే ఎండుగడ్డిని మేతగా ఉపయోగించేందుకు నిల్వ చేస్తారు. పాడి పశువులకు పచ్చిమేత, ఎండుమేత, దాణా.. ఈ మూడు అవసరం. సాధారణంగా ప్రతిరోజు ఒక్కొక్క పశువుకు 7 నుంచి 8 కేజీల ఎండు మేత ఇస్తుంటారు. ఈ ఏడాది మార్చిలోనే పచ్చిగడ్డి దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అయితే ఎండుగడ్డిపైనే ఆధారపడాలి. అధిక వర్షాల వల్ల పైరు ఎదుగుదల లేక వరిగడ్డి జిల్లాలో గణనీయంగా తగ్గిపోయింది. పశువులు ఉన్న రైతులు ఎండుగడ్డిని పొరుగు జిల్లాల నుంచి కొనుగోలు చేసి ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు.

యంత్రాలతో వరిని కోయడం వల్లే..

ఎండుగడ్డి కొరత ఉత్పన్నం కావడంతో పాడి రైతులకు పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. రైతులు వరికోత యంత్రం సహాయంతో వరిని కోస్తుండటం వల్ల వరిగడ్డి ఆశించిన స్థాయిలో రావడం లేదు. పాడి రైతులు వరిగడ్డి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్లలో తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో ఒక ట్రాక్టర్ లోడు ఎండుగడ్డి ధర రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ఉండేది. ఈ ఏడాది రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది.

వరిగడ్డి దిగుబడి తగ్గింది



నాకు మూడు గేదెలు ఉన్నాయి. రోజుకు 12 లీటర్లు పాలదిగుబడి వస్తోంది. ఈ ఏడాది వరిగడ్డి దిగుబడి బాగా తగ్గింది. ఎకరాకు 70 చుట్టలు దిగుబడి కావాల్సిఉండగా 25 మాత్రమే వచ్చాయి. వర్షాలు ఎక్కువ కురవడం, పైరు పెరుగుదల లేకపోవడంతో దిగుబడి బాగా తగ్గింది. మళ్లీ పచ్చిగడ్డి అందుబాటులోకి రావాలంటే కనీసం 7–8 నెలలు ఆగాలి. అప్పటి వరకు ఎండుగడ్డినే గేదెలకు మేతగా వేయాలి. ఇప్పుడే మోపు రూ.100 నుంచి రూ.120లు అమ్మకాలు చేస్తున్నారు. పాడి రైతుకు ఈసారి మరిన్ని కష్టాలు ఎదురయ్యేలా ఉన్నాయి.

– చిమ్మిలి వెంకటేశ్వర్లు, పాడి రైతు, కొత్తపల్లి గ్రామం

ఖర్చయినా కొనక తప్పదు



ఈ ఏడాది ఎండుగడ్డి పాడి రైతుకు పరీక్ష పెడుతోంది. ఈసారి అనుకున్నంత రాలేదు. గడ్డి వామి వేసేటప్పుడు ఆ తేడా గమనించాం. వరి కోత అయిన తర్వాత వరిగడ్డిని ఇంటికి చేర్చుకొనేటప్పుడే తగ్గినది గుర్తించా. అందుకే వరికోతలు ముగిసిన పొలాల్లోకి గేదెలను మేతకు తోలుకు వెళ్తున్నా. ఎండుగడ్డిని ఇప్పుడే మేతగా వేస్తే ఎండా కాలంలో చాలక అవస్థలు పడాలి. గేదెలను పస్తు పెట్టలేను కదా. ఈ ఏడాది ఎండుగడ్డి తప్పక కొనుగోలు చేయాల్సిందే.

– కప్పిర మల్లికార్జున, పాడి రైతు, దగదర్తి గ్రామం

పశు పోషణ భారంగా ఉంది



నాకు రెండు పశువులు ఉన్నాయి. రోజుకు ఐదు లీటర్లు పాలు ఇస్తాయి. పశువుల పెంపకం భారంగా మారుతోంది. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వల్ల పశువులకు మేత కరువవుతోంది. అందువల్ల పశు పోషణ భారంగా మారింది.

– కడియాల మహీధర్, పాడి రైతు, దగదర్తి గ్రామం

తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు

- అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు
- లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు
- మంత్రులు ఆనం, పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, చిత్రంలో మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు

నెల్లూరు (పొగతోట): గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా భారీస్థాయిలో అవినీతి జరిగిందని, అవినీతికి కారకులైన వారిని వదిలే ప్రసక్తే లేదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పి.పార్థసారథి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, కోవూరు, కావలి, ఉదయగిరి శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్ ఎండీ రాజబాబు హాజరయ్యారు. ముందుగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణాలకు అధికంగా నగదు చెల్లిస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది లబ్ధిదారులకు వారి వారి అకౌంట్లలో నగదు జమచేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు మాకెవరికీ తెలియదే అన్నట్లు అధికారులను ప్రశ్నించారు. అధికారులు నగదు పంపిణీకి సంబంధించి స్థానిక శాసనసభ్యుల కార్యాలయాల్లో పూర్తి వివరాలు అందజేశామని తెలియజేశారు. కోవూరు, ఉదయగిరి శాసనసభ్యులు మాట్లాడుతూ మాకు సమాచారమే లేదని అధికారులను ప్రశ్నించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కలుగజేసుకొని ఈసారైనా నగదు పంపిణీకి సంబంధించి స్థానిక శాసనసభ్యులకు పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అవకతవకలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రాబోవు రోజుల్లో మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కాలనీలకు లేఅవుట్‌లు ఏర్పాటుచేసిన ప్రాంతాలలో ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇకపై అధికారులందరూ శ్రద్ధగా పనిచేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. అనంతరం కోవూరు, ఉదయగిరి, కావలి శాసనసభ్యులు స్థానిక గృహనిర్మాణ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహనిర్మాణాల్లో భారీస్థాయిలో అవినీతి జరిగిందన్నారు. నాసిరకంగా ఇళ్లు నిర్మించి గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. తప్పు చేసిన వారిని క్షమించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆకలితో అలమటించిన అధికారులు

గృహనిర్మాణ శాఖమంత్రి పార్థసారథి జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అధికారులతో సమావేశం అని సమాచారమిచ్చారు. 12.30 గంటల నుంచి సమావేశానికి అధికారుల రాక ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సమావేశ మందిరం అధికారులతో నిండిపోయింది. మంత్రి రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. అధికారులు భోజనం చేయకుండా సమావేశానికి హాజరయ్యారు. మంత్రుల జాప్యం కారణంగా అధికారులు ఆకలితో అలమటించారు. చివరికి స్నాక్స్‌తో అధికారులు కాస్త ఉపశమనం పొందాల్సిన పరిస్థితి వచ్చింది. తీరిగ్గా మంత్రి మధ్యాహ్నం 3.10 గంటలకు సమావేశాన్ని ప్రారంభించారు.

పనులు చేయకుండానే నిధులు డ్రా

- అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ పథకంలో అక్రమాలు
- రూ.75 లక్షలు స్వాహా
- బీట్, సెక్షన్ అధికారుల ప్రమేయం



కొత్తపేట సీఏ ల్యాండ్ చుట్టూ కంచె లేని దృశ్యం

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కనియంపాడు వీఏఎస్ పరిధిలోని కొత్తపేట బీట్‌లో అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ పథకంలో అభివృద్ధి పనుల్లో ల్యాండ్ చుట్టూ కంచె (ఇనుప ముళ్లకంచె) వేయకుండానే నిధులు డ్రా చేసి స్వాహా చేశారనే విమర్శలు ఉన్నాయి. కోటి రూపాయల అంచనా వ్యయంతో జరగాల్సిన పనులు చేయకుండానే వీఏఎస్ ఖాతా నుంచి రూ.75 లక్షలు నిధులు డ్రా చేసి పర్సంటేజీల ప్రకారం పంచుకుని మిన్నుకుండిపోయారు.

వరికుంటపాడు బీట్ కొత్తపేట ఏరియాలో

ఉదయగిరి ఫారెస్టు రేంజ్ పరిధిలోని కృష్ణంపల్లి సెక్షన్‌లోని వరికుంటపాడు బీట్ కొత్తపేట ఏరియాలో 118 హెక్టార్లు భూమిని ఓ కంపెనీ కొనుగోలు చేసి అటవీశాఖకు అప్పగించింది. ఈ భూమిలో అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేస్తున్నారు. గతేడాది నుంచి పనులు జరుగుతున్నాయి. ఈ భూమి చుట్టు ఇనుప కంచె ఏర్పాటుకు ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో రూ.75 లక్షలు డిపార్టుమెంట్ వీఏఎస్ జాయింట్ అకౌంట్‌లో జమ చేసింది. ఈ నిధులు ఉపయోగించి కంచె ఏర్పాటు చేయాలి. కానీ పనులు జరగలేదు. నిధులు మాత్రం ఖాతా నుంచి డ్రా చేసి స్వాహా చేశారు.

వీఏఎస్ పేరుతో దోపిడీ

కనియంపాడు వీఏఎస్‌లో ఉన్న చైర్మన్, వైస్ చైర్‌పర్సన్లు ఇద్దరూ అక్షరాస్యులు కారు. వీరి అమాయకత్వాన్ని అడ్డంపెట్టుకొని ఎఫ్‌బీఓ, సెక్షన్ అధికారి తమ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే కాంట్రాక్టర్ అవతారం ఎత్తారు. అన్ని పనులు వారి పర్యవేక్షణలో జరుపుకుంటూ వీఏఎస్‌ను నిర్వీర్యం చేశారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పర్సంటేజీలు ఇస్తుండటంతో తాము ఏమీ చేసినా ఏమీ కాదు అనే భావన ఆ క్షేత్ర స్థాయి అధికారుల్లో ఉంది. ఆ భావనే అవినీతికి దారితీస్తోంది. అందులో భాగంగా వీఏఎస్ ఖాతాలో ఉన్న నిధులు డ్రా చేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అటవీ అధికారులకు వాహనాలు

నెల్లూరు(అర్బన్): ఇటీవల ప్రభుత్వం పది మహీంద్ర బొలెరో నూతన వాహనాలు కొనుగోలు చేసి వాటిని నెల్లూరు వేదాయపాళెంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఉంచారు. వాటిని శుక్రవారం జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్ఓ) మహబూబ్ బాషా ప్రారంభించి రేంజ్ ఆఫీసర్లకు, కావలి సబ్ డీఎఫ్ఓకు హ్యాండోవర్ చేశారు. ఇందులో ఆరు వాహనాలను నెల్లూరు డివిజన్‌కు కేటాయించారు. మిగతా 4 వాహనాలను ఇతర డివిజన్లకు కేటాయించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మహబూబ్ బాషా మాట్లాడుతూ అడవుల్లో తనిఖీలకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వేగంగా గమ్యస్థానానికి చేరుకునేందుకు ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్లు రవీంద్ర, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



వాహనాల పత్రాలను రేంజర్లకు అందజేస్తున్న డీఎఫ్ఓ

వక్ఫ్ బిల్లు ఆమోదం కక్షపూరితం



నిరసన తెలియజేస్తున్న ముస్లిం సంఘ నాయకులు

- ముస్లిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో మసీదు వద్ద నిరసన

నెల్లూరు(బారకాసు): కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని కక్షపూరితంగా తెచ్చిందని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ జియాఉల్‌హక్ అన్నారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పెద్దబజార్‌లో ఉన్న మర్కజ్ అహమదియా మసీదు వద్ద వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం శోచనీయమన్నారు. ఈ నల్ల చట్టాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ బిల్లు మత స్వేచ్ఛ, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ సిద్దిక్, సయ్యద్ ఐరాజ్, కోస్తాంధ్ర మైనార్టీ రైట్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉమర్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షాహుల్, అమానుల్లా, అంజాద్, షబ్బీర్, రఫీ, షఫీ పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్



నిందితులతో ఏసీ, ఏఈఎస్ తదితరులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 20.200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ పి.దయసాగర్ తన కార్యాలయంలో దాడుల వివరాలను శుక్రవారం వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా చెట్టికుల్లం గ్రామానికి చెందిన సుందర్ పాండి, నేతాజీ, సముత్తువాపురానికి చెందిన కుమార్‌లు గంజాయి విక్రేతలు. వీరు కొంతకాలంగా విశాఖపట్నంకు చెందిన హనుమాన్ అలియాస్ హనుమంత్ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకొంటున్నారు. శుక్రవారం ఏఈఎస్ జగదీశ్వర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించి చెన్నై వెళుతున్న ఆర్టీసీ బస్సుల్లో బ్యాగ్‌లను తనిఖీ చేశారు. వాటిలో ఉన్న 20 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నిందితులు హనుమాన్ వద్ద రూ.90 వేలుకు గంజాయిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయిని ఎక్సైజ్ నెల్లూరు–2 స్టేషన్‌లో అప్పగించారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలు కాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది ఎ.శ్రీనివాసులు, కె.రమణయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

చొరబాటుదారులను గుర్తిస్తాం

- కోస్టుగార్డు, మెరైన్ అధికారుల వెల్లడి



మాట్లాడుతున్న మెరైన్ సీఐ వేణుగోపాలరెడ్డి

ముత్తుకూరు: సముద్రంలో 250 నాటికల్ మైళ్ల దూరం వరకు చొరబాటుదారులు ఎవరైనా ప్రవేశిస్తే వెంటనే గుర్తించగలిగే సామర్థ్యం ఉందని కృష్ణపట్నం ఇండియన్ కోస్టుగార్డు డిప్యూటీ కమాండెంట్ సీహెచ్ లోకేశ్, మెరైన్ సీఐ వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. కృష్ణపట్నం పంచాయతీ ఆర్కాట్‌పాళెంలో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమాండెంట్ మాట్లాడుతూ సముద్రంలో వేట చేసే సమయంలో కొత్త వ్యక్తులు, బోట్లు కనిపించిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. బోటు కండిషన్‌లో ఉంటేనే వేటకు వెళ్లాలన్నారు. బయోమెట్రిక్ కార్డులు దగ్గర ఉంచుకోవాలని, బోటు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మెరైన్ సీఐ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం విధిస్తారని, తమిళనాడులోని కడలూరు బోట్లు ఇటు వైపు రాకుండా చర్యలు తీసుకొంటామని చెప్పారు. పలువురు మత్స్యకారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. మత్స్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంఘమిత్ర చరిత పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



గౌతమ్ (ఫైల్)

పొదలకూరు : మండలంలోని వావింటపర్తి గ్రామానికి చెందిన గౌతమ్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్టు కండలేరు డ్యామ్ పోలీస్‌స్టేషన్లో శుక్రవారం బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసిన గౌతమ్ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహకారంగా ఉంటున్నాడు. గురువారం ఉదయం నిమ్మతోటలో పనులు చేసేందుకు వెళ్లిన విద్యార్థి కనిపించకుండా పోయాడు. తోటలోనే ఉన్న తల్లిదండ్రులు చాలా సేపటి వరకు కొడుకు రాకపోవడంతో ఆందోళన చెంది చుట్టు పక్కల ఆరా తీశారు. సెల్‌ఫోన్ సైతం గౌతమ్ నిమ్మ చెట్టు కింద పడేసి ఉండడంతో ఆచూకీ తెలుసుకోవడం కష్టంగా మారింది.

పిడుగుపడి గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివామి

సోమశిల: పిడుగు పడి గడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలోని లింగంగుంటలో శుక్రవారం జరిగింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఈదురు గాలులతోపాటు రైతులు మాదిరెడ్డి యశోదకృష్ణ, బాలకృష్ణకు చెందిన గడ్డివామిపై పిడుగు పడింది. దీంతో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేస్తూనే అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు 700 గడ్డి మోపులు కాలి బుడిదయ్యాయి.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): డీఎస్సీకి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లుగా జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు టెట్ అర్హత మార్కుల పత్రం, నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ఉన్న ఈ–సేవ పాత భవనంలోని స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లా వాసులు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. వివరాలకు 93815 54779, 93902 39588 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:113
లేయర్ (లైవ్)	:105
బ్రాయిలర్ చికెన్	:202
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:226
లేయర్ చికెన్	:178



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.115
సన్నవి	:రూ.80
పండ్లు	:రూ.50



రైల్లో దోపిడీ.. నిర్లక్ష్యానికి పరాకాష్ట



అల్లూరు రోడ్డు, పడుగుపాడు స్టేషన్ మాస్టర్ల అశ్రద్ధ


- ఇంటర్ లాకింగ్ సిస్టమ్ బోర్డులో కనిపిస్తున్న సిగ్నల్స్
- అర్ధరాత్రి పూట సిగ్నల్ ట్యాంపర్ అయితే గుర్తించడంలో ఘోర వైఫల్యం
- రైల్వే భద్రతా సిబ్బందితోపాటు సివిల్ పోలీసులను అప్రమత్తం చేయని వైనం
- సమాచారం ఇచ్చి ఉంటే నాలుగు వైపులా పోలీసులు చుట్టు ముట్టేవారు
- ఎస్ఎంల అసమర్థత వల్లే మదురై రైల్లో దోపిడీ, మరో రైల్లో విఫలయత్నం
- పడుగుపాడు వద్ద రైలు ఆపి దుండగులు పరారీకి కారణం

బిట్రగుంట–నెల్లూరు రైల్వే స్టేషన్ల మధ్య అల్లూరురోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైల్వే సిగ్నల్స్‌ను ట్యాంపర్ చేసి మదురై ఎక్స్‌ప్రెస్‌లో చేసిన దోపిడీ ఘటన, ఇదే రైలు పడుగుపాడు వద్ద నిలిచిపోయిన ఘటనల్లో రైల్వేస్టేషన్ మాస్టర్ల ఘోర వైఫల్యం కనిపిస్తోంది. తొలుత అల్లూరు రోడ్డు స్టేషన్ సమీపంలో అర్ధరాత్రి పూట సిగ్నల్ ట్యాంపర్ జరిగింది. ఈ విషయం ఆ స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ కంట్రోల్‌లో ఉండే ఇంటర్ లాకింగ్ సిస్టమ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. సిగ్నల్ క్లియరెన్స్ లేదని బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ సైతం ఆ స్టేషన్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్ధరాత్రి వేళ నిర్మానుష్య సిగ్నల్ పాయింట్ వద్ద ట్యాంపర్ అయిందంటే అక్కడ ఏదో నేరమో, ఘోరమో జరిగిందని అప్రమత్తమై అటు రైల్వే భద్రతా సిబ్బందికి కానీ, ఇటు సివిల్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే గంట తర్వాత వచ్చిన మదురై ఎక్స్‌ప్రెస్ రైల్లో దోపిడీ జరిగే అవకాశం ఉండేది కాదు. దుండగులను పట్టుకునే అవకాశాలు కూడా మెండుగా ఉండేవి.

బిట్రగుంట: రైలు ప్రయాణికుల భద్రత విషయంలో రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారుల్లో అప్రమత్తత కొరవడింది. ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం నేరస్తులకు వరంగా మారింది. అల్లూరురోడ్డు, పడుగుపాడు రైల్వేస్టేషన్ల సమీపంలో అర్ధరాత్రి వేళ సిగ్నల్ ట్యాంపర్ జరిగిన విషయంలో భద్రతా సిబ్బంది నిఘా వైఫల్యం కంటే.. డ్యూటీలో ఉన్న స్టేషన్ మాస్టర్ల నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రతి స్టేషన్‌లో ఆ స్టేషన్ మాస్టర్ కంట్రోల్‌లో సిగ్నల్ మానటరింగ్ సిస్టమ్ ఉంటుంది. దీన్నే ఇంటర్ లాకింగ్ సిగ్నల్ ప్యానల్ అంటారు. ఇందులో ప్రతి సిగ్నల్ పోస్ట్ సిగ్నల్స్ డిస్‌ప్లే అవుతుంటాయి. ఒక రైలు ముందుకెళ్లేందుకు ఈ సిగ్నల్స్ కీలకం. ఆ స్టేషన్ మాస్టర్ పరిధిలో ఉండే సిగ్నల్ పోస్ట్‌ల వద్ద సిగ్నల్ ట్యాంపర్ అయి సిగ్నల్ మారిపోయి ఉంటే అది స్పష్టంగా ఇంటర్ లాకింగ్ సిగ్నల్ ప్యానల్‌పై కనిపిస్తోంది. ట్యాంపర్ అయిన సిగ్నల్‌ను పునరుద్ధరించాలంటే ముందు సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బంది ఆ స్పాట్‌కు వెళ్లాల్సి ఉంది. అది జరిగాకే ఆ రైలు ముందుకెళ్తోంది.

నిర్లక్ష్యమా?.. వైఫలమా?

మంగళవారం అర్ధరాత్రి 11.13 గంటల సమయంలో అల్లూరురోడ్డు స్టేషన్ మాస్టర్ హౌరా నుంచి బెంగళూరు వెళ్లాల్సిన బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు త్రూ సిగ్నల్ ఇచ్చారు. అయితే సిగ్నల్ పాయింట్ వద్ద రైలు పట్టా జాయింట్ (గ్లాడ్ జాయింట్) మధ్య కాయిన్ పెట్టి సిగ్నల్స్ ట్యాంపర్ చేయడంతో రెడ్ సిగ్నల్ పడింది. ఈ విషయం ఇంటర్ లాకింగ్ సిగ్నల్ ప్యానల్‌లో కనబడుతుంది. అదే సమయంలో వచ్చిన బెంగళూరు రైలు డ్రైవర్ సిగ్నల్ లేదని ఆ స్టేషన్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సిగ్నల్ ట్యాంపరింగ్ జరిగిందనే విషయం తెలిసినా సంబంధిత స్టేషన్ మాస్టర్ అటూ, ఇటూ ఉండే రైల్వేస్టేషన్ మాస్టర్లను అప్రమత్తం చేయలేదు. భద్రతా సిబ్బందికి సమాచారం అందించలేదు. కనీసం డయల్ 100కు కాల్ చేయలేదు. ట్రాక్ సిబ్బందిని అప్రమత్తం చేసి సిగ్నల్ ట్యాంపర్ అయిన చోట క్లియరెన్స్ చేసి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను ముందుకెళ్లేలా చేశారు. ఈ రైలు సుమారు 22 నిమిషాలు నిలిచిపోయింది. సిగ్నల్ ట్యాంపర్ జరిగిన ప్రాంతానికి రైలు నిలిచిన ప్రాంతానికి మధ్య దూరం ఉండడంతో ఈ రైలులో దొంగతనం విఫలం అయింది.



రైల్వే స్టేషన్ మాస్టర్ కంట్రోల్ ఉండే ఇంటర్ లాకింగ్ సిగ్నల్ ప్యానల్ (ఫైల్)

భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసి ఉంటే..

రైల్వే ట్రాక్‌లో నిర్మానుష్య ప్రాంతంలో ఉండే సిగ్నల్‌ను, అదీ ప్యాసింజర్లు ప్రయాణించే రైలుకు ఇచ్చిన సిగ్నల్ ట్యాంపరింగ్ జరిగిందంటే.. అది కచ్చితంగా దోపిడీ దొంగల పనే అయి ఉంటుందని, గత అనుభవాల దృష్ట్యా అవుటర్ వద్ద సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్యలు వచ్చిన వెంటనే అప్రమత్తమవ్వాల్సిన రైల్వే అధికారులు ఆ దిశగా స్పందించలేదు. అల్లూరురోడ్డు స్టేషన్ మాస్టర్‌తోపాటు పడుగుపాడు స్టేషన్ మాస్టర్ నిర్లక్ష్యం కనిపిస్తోంది. వీరిద్దరూ అప్రమత్తమై భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసినా.. డయల్ 100కు కాల్ చేసినా.. అని వైపుల నుంచి అటు జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఇటు సమీప స్టేషన్లో ఉండే సివిల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే వారు. అల్లూరు రోడ్డు స్టేషన్ సమీపంలో బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నల్ ట్యాంపర్ జరిగి, పునరుద్ధరించిన గంట తర్వాత 12.05 గంటల సమయంలో వచ్చిన ఛండీఘర్ నుంచి మదురై వెళ్తున్న మధురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అదే రైల్లో వస్తున్న దుండగులు చైన్‌లాగి నిలిపి వేసి, ఎస్–2, ఎస్–4, ఎస్–5 కోచ్‌ల్లో దోపిడీకి పాల్పడ్డారు. వాస్తవానికి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నల్స్‌లో సమస్యలు వచ్చిన వెంటనే రైల్వే అధికారులు స్పందించి జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలను, సివిల్ పోలీసులను అప్రమత్తం చేసి ఉంటే ఈ రైలు ఆగిన 22 నిమిషాల్లో అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టే వారు. దొంగల ముఠా సులభంగా దొరికిపోయేది. గంట తర్వాత వచ్చిన మదురై ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగే అవకాశాలు ఉండేవి కావు. బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు సిగ్నల్ ట్యాంపర్, మదురై ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగిన విషయం కూడా పక్క స్టేషన్ మాస్టర్లకు తెలిపి ఉంటే పడుగుపాడు స్టేషన్ సమీపంలో జరిగిన సిగ్నల్ ట్యాంపర్ విషయంలో అయినా అప్రమత్తమయ్యే అవకాశం ఉండేది.



డయల్ 100కు కాల్ చేసినా..

సివిల్ పోలీసులు తమ స్టేషన్ పరిధిలో ఆ సమయంలో గస్తీలో ఉంటారు. కనీసం అల్లూరురోడ్డు స్టేషన్ మాస్టర్ డయల్ 100కు కాల్ చేసి తన స్టేషన్ పరిధిలో సిగ్నల్ ట్యాంపరింగ్ జరిగింది. ఇది దోపిడీ దొంగల పనై ఉంటుందని సమాచారం ఇచ్చినా ఈ స్టేషన్‌కు ఐదు కి.మీ. దూరంలో దగదర్తి, 10 కి.మీ. దూరంలో బిట్రగుంట, అంతే దూరంలోని అల్లూరు, 20 కి.మీ. దూరంలో కొడవలూరు పోలీసులు నాలుగు వైపులా చుట్టుముట్టే అవకాశం ఉండేది. బిట్రగుంటలోనే జీఆర్పీ అవుట్ పోస్టు సిబ్బంది ఉన్నారు. ఇక పడుగుపాడు స్టేషన్ విషయానికి వస్తే కూతవేటు దూరంలోనే కోవూరు పోలీస్‌స్టేషన్ ఉంది. సమీపంలో నెల్లూరు నగరంలో ఆరు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది గస్తీలో ఉంటారు. నెల్లూరులోని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సైతం క్షణాల్లో వచ్చేందుకు అవకాశాలు ఉండేవి. అల్లూరు రోడ్డు వద్ద దోపిడీకి గురైన మదురై ఎక్స్‌ప్రెస్ పడుగుపాడు స్టేషన్ వద్ద సిగ్నల్ ట్యాంపర్ చేసి దుండగులు దిగిపోయి ఉంటారని అనుమానాలు ఉన్నాయి. పడుగుపాడు స్టేషన్ మాస్టర్ అప్రమత్తం అయి ఉంటే.. దుండగులను పట్టుకునే అవకాశం ఉండేది. మొత్తం మీద రైల్వేస్టేషన్ మాస్టర్ల నిర్లక్ష్యం, వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

తప్పుడు వాగ్మూలంతో కాకాణిపై అక్రమ కేసు

- రాజకీయ వేధింపులకే అట్రాసిటీ చట్టం దుర్వినియోగం
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కేసే కుట్ర
- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తప్పుడు వాంగ్మూలంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమంగా కేసు నమోదు చేశారని, ఇది కూటమి ప్రభుత్వ కుట్ర రాజకీయాలకు పరాకాష్ట అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ధ్వజమెత్తారు. శుక్రవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శనివారం వరకు కాకాణి నెల్లూరులోనే ఉన్నా నోటీసులు ఇవ్వడానికి రాని పోలీసులు, ఉగాది పండగ కోసం తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లినప్పుడే, కావాలనే ఆయన ఇంటికి నోటీసు అంటించి మర్నాడే విచారణకు రావాలని చెప్పడం చూస్తే వేధింపులకు గురి చేయమే అన్నారు. జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ చూడని విధంగా సీనియర్ నాయకుల మీద అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఈ వికృత రాజకీయాలు చూసి అన్ని వర్గాల వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కాలని కూటమి ప్రభుత్వం ఈ వికృత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మళ్లించాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం

రాజకీయంగా ఎదుర్కోలేక వేధించడం కోసమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం చేస్తున్నారని మేరిగ ఆరోపించారు. ఇటీవల సుప్రీంకోర్టు సైతం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ఫిర్యాదుల విషయంలో నమోదు చేసే కేసులకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాజకీయ నాయకులను వేధించడానికి అట్రాసిటీ చట్టాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు

కలిగిరి: పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పొగాకు కొనుగోలు చేసే కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. ఈ ఏడాది నాణ్యమైన పొగాకు దిగుబడులు వచ్చిన నేపథ్యంలో వేలంలో మంచి ధరలకు పొగాకు కొనుగోలు చేయాలని సూచించారు. రైతుల శ్రేయస్సుకు పొగాకు బోర్డు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్, కంపెనీల ప్రతినిధులు, పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

ఈ రోడ్డు ఎవరి కోసమో!



నారంపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీహరినాయుడు ఇంటి ఎదురుగా ప్రభుత్వ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు

- ప్రభుత్వ నిధులతో మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద సీసీ రోడ్డు నిర్మాణం

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేటలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు ఇంటి వద్ద రూ.2 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు చర్చనీయాంశంగా మారింది. ఆ రోడ్డు నిర్మాణం వల్ల గ్రామస్తులకు ఎలాంటి ఉపయోగం లేకపోగా కనీసం ఆయనకు కూడా ఎలాంటి ఉపయోగం లేదని స్థానికులు అంటున్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంటికి ఎదురుగా 67వ నంబరు జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు, మహిమలూరులను కలుపుతూ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టింది. అప్పట్లో నిర్మించిన భవనం బేస్‌మెంట్ కంటే నూతన రోడ్డు నిర్మాణం రెండు, మూడు అడుగులు ఎత్తులో వెళ్లింది. దీంతో తన ఇంటి ప్రహరీ గోడకు ఎదురుగా ఇటీవల ప్రభుత్వ నిధులతో ఎవరికి ఉపయోగంలేని సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సిమెంటు రోడ్డు మీదనే మండల పరిషత్ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని రేపో, మాపో పనులు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

నెల్లూరురూరల్: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118 జయంతి ఉత్సవాలను శనివారం నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పామాలంకరణ జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జయంతి ఉత్సవ సభ జరుగుతుందన్నారు. ఈ జయంతి ఉత్సవ సభకు జిల్లాలోని అందరూ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, అనధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కండలేరులో 48.083 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 48.083 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

17న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 17వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని జెడ్పీ సీఈఓ విద్యారమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. వీటికి ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఇద్దరు టీఏలు, ఈసీ సస్పెన్షన్
- ఆరుగురు ఎఫ్ఏలు కూడా
- రూ.74 లక్షలు రికవరీకి ఆదేశాలు
- డ్వామా పీడీ గంగాభవాని

పొదలకూరు : ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డ్వామా పీడీ గంగాభవాని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో పది రోజుల పాటు 17 బృందాలు సామాజిక తనిఖీలు నిర్వహించి ఇచ్చిన నివేదికల ప్రకారం అవకతవకలకు పాల్పడిన వారిపై రికవరీలు విధించడంతోపాటు సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. పులికల్లు, ఆర్‌వైపాళెం, తోడేరు, వావింటపర్తి, పార్లపల్లి, నావూరు, మొగళ్లూరు పంచాయతీల్లో పనులు సక్రమంగా జరిగినట్లు నివేదికలు వచ్చాయన్నారు. మిగిలిన పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి రూ.74,08,805 రికవరీలు విధించినట్లు వెల్లడించారు. పొదలకూరు రూ.17 లక్షలు, నేదురుమల్లి రూ.16 లక్షలు, బిరదవోలు రూ.17 లక్షలు అత్యధికంగా రికవరీలకు ఆదేశించామన్నారు. సంబంధిత టీఏలు, ఎఫ్ఏల నుంచి రికవరీ చేస్తామన్నారు.



సోషల్ ఆడిట్లో విచారణ నిర్వహిస్తున్న పీడీ గంగాభవాని ఇతర అధికారులు

సస్పెన్షన్ వేటు

ఈసీ వై.సుధాకర్, టీఏలు నాగార్జున, త్రిబునేష్‌బాబులను సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ వెల్లడించారు. బిరదవోలు, చాటగొట్ల, విరువూరు, మహ్మదాపురం, ఇనుకుర్తి, దుగ్గుంట ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా సస్పెండ్ చేశామన్నారు. ఈ సమావేశంలో డీవీఓ డీ.విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఏపీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.